క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత

హుజూర్‌నగర్ : చింతలపాలెం మండలం బుగ్గ మాదారం గ్రామానికి చెందిన బండారి రాకేష్ న్యూరో సమస్యతో బాధపడుతున్నాడు. వైద్య ఖర్చుల నిమిత్తం ఓజో ఫౌండేషన్ చైర్మన్ పిల్లుట్ల రఘు శుక్రవారం ఆ ఫౌండేషన్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కుక్కల వెంకన్న ద్వారా రూ.40 వేల ఆర్థికసాయాన్ని అతనికి హుజూర్‌నగర్ పట్టణం లోని ఓజో కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో ఎ.శ్రీను, ఎస్.సాయి విరాట్, గణేష్, సుదర్శన్, గురవయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన

పాలకవీడు : సంప్రదాయ పంటల నుంచి రైతాంగాన్ని వినూత్న పంటల వైపు మళ్లించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగు చేసే విధంగా రైతులను ప్రోత్సహిస్తుందని మండల వ్యవసాయాధికారి బి.రాజు అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని గుడుగుంట్లపాలెం రైతువేదికలో ఆయిల్ పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓలు వెంకటేష్, శ్రీకాంత్, శారద, ఎంపీటీసీ వెంకటయ్య, పంచాయతీ కార్యదర్శి నాగపద్మజ, ఆయిల్ పామ్ సాగు ఫీల్డ్ అసిస్టెంట్ సైదా, రైతు బంధు సమితి గ్రామ కోఆర్డినేటర్ సోమిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకట్‌రెడ్డి రైతులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

మునగాల : యువత మాదక ద్రవ్యాలకు, మత్తు పానీయాలకు దూరంగా ఉండాలని మునగాల ఎస్ఐ పి.లోకేష్ కోరారు. మాదక ద్రవ్యాల నియంత్రణ కోసం డీవైఎఫ్ఐ రూపొందించిన స్టిక్కర్లను శుక్రవారం మునగాల పోలీస్ స్టేషన్‌లో ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఎస్ఐ కృష్ణమూర్తి, సిబ్బంది జానీ, రాంబాబు, లక్ష్మణ్, ఈశ్వర్, ఏఆర్ కానిస్టేబుల్ మామిడి త్రిల్లర్ మంజు, డీవైఎఫ్ఐ మండల నాయకులు గడ్డం వినోద్, దేవరం శ్యామ్ సుందర్‌రెడ్డి, రాకేష్, ప్రదీప్, నవీన్ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్

చిలుకూరు : పౌష్టికాహారంతో రక్తహీనతకు చెక్ పెట్టొచ్చని ఎంపీపీ బండ్ల ప్రశాంతి కోటయ్య అన్నారు. శుక్రవారం మండలం కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలింతలకు, గర్భిణులకు నిర్వహించిన పోషణ్ అభియాన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం పోషణ అభియాన్ కార్యక్రమంపై బాలింతలకు, గర్భిణులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయుష్ ఆరోగ్య కర దీపిక పుస్తకం ఆవిష్కరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సరిత, ఐసీడీఎస్ సీడీపీఓ విజయలక్ష్మి, సర్పంచ్ కొడారు బాబు, సూపర్‌వైజర్లు సునిత, ఉపేంద్ర, డాక్టర్ సుశీల, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

15 మంది జూదరుల అరెస్ట్

కోదాడ: పట్టణ పరిధిలోని రంగనిగుడి సమీపంలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్న 15మందిని పోలీసులు పట్టుకున్నారు. వీరి నుంచి రూ.1.44లక్షలతో పాటు 15 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం రాత్రి జరిగిన ఈ సంఘటన వివరాలను శుక్రవారం వరకు పోలీసులు వెల్లడించకపోవడం పలు అనుమానాలకు తావిస్తుంది. పట్టుబడిన వారిలో ఇద్దరు ఉపాధ్యాయులతో పాటు పలువురు ఇతర శాఖల ఉద్యోగులు ఉన్నట్లు సమాచారం. వీరు తమ పేర్లను బయటకు రాకుండా రాజకీయనేతల నుంచి పోలీసుల మీద ఒత్తిడి తీసుకురావడంతో కేసు వివరాలు పోలీసులు బయటకు వెల్లడించలేదని సమాచారం. ఈవిషయమై పట్టణ సీఐ రాము మాట్లాడుతూ పేకాట శిబిరంపై దాడి చేసి 15 మందిని అదుపులో తీసుకొని కేసు నమోదు చేసినమాట వాస్తవమేనన్నారు. కమ్యూనికేషన్ గ్యాప్ వల్ల సమాచారం ఇవ్వలేకపోయామని, దీనిలో దాపరికం ఏమి లేదని, పట్టుబడినవారిలో ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉన్నారన్నారు.

రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

గరిడేపల్లి : రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్య, వైద్యం, ఉపాధికై ఉద్యమం చేయాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ములకపల్లి రాములు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటరాములు, రైతు సంఘం రాష్ట్ర నాయకుడు మల్లు నాగార్జునరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు, సీఐటీయూ జిల్లా నాయకులు యాకుబ్, కొదమగుండ్ల నగేష్, శ్రీను, జానయ్య, హుస్సేన్, పఠాన్, మహబుబ్‌అలీ,తదితరులు ఉన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలి

హుజూర్‌నగర్ : మహిళా రిజర్వేషన్ బిల్లును తక్షణమే అమలు చేయాలని టీఎస్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీతల రోషపతి కోరారు. శుక్రవారం హుజూర్‌నగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. మహిళా రిజర్వేషన్ బిల్లును ఉభయ సభల్లో ఏకగ్రీవంగా ఆమోదించడం దేశానికి గర్వకారణమన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం చంద్రబాబు నాయుడిపై పెట్టిన అక్రమ కేసుల ఎత్తి వేయాలని కోరారు. కార్యక్రమంలో కోటమ్మ, మణి, లక్ష్మి, పద్మ, వెంకటేశ్వర్లు, వెంకన్న, రమేష్, బాషా, తదితరులు పాల్గొన్నారు.

మురుగు నిలిచి.. దోమలు వ్యాప్తి

మున్సిపాలిటీల్లో అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం నిర్వహణ

- ఇళ్ల మధ్య నిలిచిన మురుగు
- రోడ్లవెంట పేరుకుపోయిన చెత్తాచెదారం
- ప్రబలుతున్న విష జ్వరాలు
- పట్టించుకోని మున్సిపల్ అధికారులు


తిలక్‌నగర్‌లో ఇళ్ల మధ్య నిలిచిన మురుగు


బైపాస్ రోడ్డు వెంట పేరుకుపోయిన చెత్త


బైపాస్ రోడ్డు వెంట వీధిలో డ్రెయినేజీ లేక నిలిచిన మురుగు


శ్రీనివాస థియేటర్ వీధిలో ఇళ్ల మధ్య ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చి మొక్కలు

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. పట్టణ శివారు ప్రాంతాల్లోని కాలనీలకు రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ లేదు. మున్సిపాలిటీలో 28 వార్డులు ఉండగా ప్రస్తుత జనాభా దాదాపు 48 వేల వరకు ఉంది. రోజురోజుకు పట్టణం విస్తరిస్తోంది. కానీ అంతకు తగ్గ సౌకర్యాలు లేవు. అయితే పట్టణంలోని ప్రధాన వీధుల్లో పేరుకుపోతున్న చెత్తను, మురుగు కాలువలను మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేస్తున్నారు తప్ప మారుమూల వీధులను, కాలనీలను పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పారిశుద్ధ్య సిబ్బంది సరిపడా లేవపోవడమే ప్రధాన కారణమని పలువురు చెబుతున్నారు.

200 వైరల్ ఫీవర్ కేసులు

మున్సిపాలిటీ పరిధిలోని దద్దనాల చెరువు కాలనీ, శ్రీనగర్ కాలనీ, అంబేద్కర్ నగర్, సీతారాంనగర్, ఎన్నెస్పీ క్యాంప్ కాలనీ, బైపాస్ రోడ్డు, 14, 15 వార్డుల్లో ఎస్సీ, ఎస్టీ కాలనీలు తదితర ప్రాంతాల్లో చెత్తచెదారం పేరుకుపోయింది. వర్షం వస్తే మురుగు నీరు వెళ్లేందుకు నిర్మించిన మురుగు కాలువలు రోడ్డు కన్నా ఎత్తులో ఉండటంతో ఆ నీరు కాలువల్లోకి వెళ్లకుండా రోడ్డుపైనే నిలుస్తోంది. దీంతో దుర్గంధం వెదజల్లుతోందని, దోమలు విపరీతంగా వృద్ధి చెంది రాత్రిళ్లు నిద్రలేకుండా చేస్తున్నాయని ఆయా కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దోమలు కుట్టడంతో వైరల్ ఫీవర్స్‌తో పాటు డెంగీ, మలేరియా తదితర జ్వరాలు వస్తున్నాయి. ఇటీవల పట్టణంలో పలువురికి డెంగీ ఫీవర్ రావడంతో ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుంటున్నారు. నెల రోజుల నుంచి పట్టణంలోని ఏరియా హాస్పిటల్‌లో దాదాపు 200 వైరల్ ఫీవర్ కేసులు నమోదయ్యాయని అధికారులు తెలిపారు. ఇంత జరుగుతున్నా అధికారులు తూతూమంత్రంగా చర్యలు తీసుకుంటున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

కుక్కలు, పందుల సంచారం

మున్సిపాలిటీలో దోమలతో పాటు కుక్కలు, పందుల సంచారం కూడా ఎక్కువైంది. దోమల నియంత్రణను ఫాగింగ్ యంత్రాలు రెండు ఉండగా దానిలో ఒకటి పని చేయడం లేదు. 4 పవర్ స్ప్రేయర్లు ఉన్నాయి. ఫాగింగ్, స్ప్రేయర్ ఆయిల్ బాల్స్, బ్లీచింగ్, ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు, తదితర వాటి కోసం మున్సిపాలిటీ నుంచి దాదాపు నెలకు రూ 3.5 లక్షలు ఖర్చు చేస్తున్నారు. అయినా ఫలితం లేదని పలువురు వాపోతున్నారు.

విష జ్వరాలు ప్రబలుతున్నాయి



పట్టణంలోని పలు కాలనీల్లో ఉన్న ఖాళీ స్థలాల్లో నీరు నిలిచి దోమలు వృద్ధి చెందుతున్నాయి. పందులు సంచరిస్తున్నాయి. దీంతో ప్రజలు ప్రజలు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ లాంటి జ్వరాల బారిన పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలి.

– కోళ్లపూడి యోహాన్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు, హుజూర్‌నగర్

ఫాగింగ్‌పై నిర్లక్ష్యం


50 ఫీట్ల రోడ్డులోని మురుగు కాలువ ఇలా..

నేరేడుచర్ల : మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో డ్రెయినేజీలు మురికి కుపాలుగా మారి దోమలకు నిలయాలుగా మారుతున్నాయి. 50 ఫీట్ల రోడ్డులో డ్రెయినేజీ లేక మురుగు నీరు రోడ్డుపై నిలుస్తోంది. మున్సిపాలిటీలో ఫాగింగ్ మిషన్ ఉన్నప్పటికీ సిబ్బంది నిర్లక్ష్యంతో మిషన్ వినియోగించడం లేదు. ముగురు నీరు నిల్వ ఉన్న చోట, మురుగు కాలువల్లో మలాథియన్ మందు పిచికారీ చేయకపోవడంతో దోమలు స్వైర విహారం చేస్తున్నాయి. అదేవిధంగా ఇళ్ల మధ్యలోని ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలతో పాటు మురుగునీరు నిల్వ ఉండి పందులకు ఆవాసాలుగా మారాయి.

ఇళ్ల ముందే మురుగునీరు



మున్సిపాలిటీలో దోమలు విపరీతంగా ఉన్నప్పటికీ మున్సిపల్ సిబ్బంది ఫాగింగ్ చేయడం లేదు. దీంతో ప్రజలు విష జ్వరాల బారిన పడుతున్నారు. 50 ఫీట్ల రోడ్డులో డ్రెయినేజీ లేకపోవడంతో ఇళ్ల ముందే ము రుగు నీరు నిలుస్తోంది.

– వాస పల్లయ్య, సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా నియోజకవర్గ కన్వీనర్

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా

- కోదాడ మాజీ ఎమ్మెల్యే పద్మావతి


మునగాల: తాడువాయిలో గాయపడిన వ్యక్తిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మావతి

మునగాల : మండలంలోని తాడువాయిలో ఇటీవల అనారోగ్యానికి గురై మృతి చెందిన గట్టు స్వరూప కుటుంబంతో పాటు ప్రమాదంలో గాయపడిన ఇరువురు వ్యక్తులను శుక్రవారం కోదాడ మాజీ ఎమ్మెల్యే నలమాద పద్మావతి పరామర్శించారు. స్వరూప ముగ్గురు పిల్లల చదువుకు అయ్యే ఖర్చును తాను భరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తాడువాయి తండాకు చెందిన గిరిజన హామాలీలు నునావత్ సుందరయ్య, మాలోతు గన్యాలు ఇటీవల మునగాలలో జరిగిన మిల్లు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఇంటివద్ద చికిత్స పొందుతుండగా వారిని పరామర్శించి మెరుగైన వైద్యం కోసం అయ్యే ఖర్చును తాను భరిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొలిశెట్టి బుచ్చిపాపయ్య, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి జిల్లేపల్లి వెంకటేశ్వర్లు, మండల పార్టీ అధికార ప్రతినిధి వేనేపల్లి వీరబాబు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేవరం సుధీర్‌రెడ్డి, వల్లోజు శ్రీనివాస్, బాలకృష్ణ, వినయ్, కృష్ణ, వీరన్న పాల్గొన్నారు.

నేడు మునగాలలో కాంగ్రెస్ ధర్నా

మునగాల : సాగర్ ఎడమ కాలువకు యుద్ధప్రాతిపదికన సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం మునగాల శివారులోని సాగర్ ఎడమ కాలువ ప్రధాన గేట్ల వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించనున్నట్లు కోదాడ మాజీ ఎమ్మెల్యే నలమాద పద్మావతి తెలిపారు. ఈమేరకు ధర్నా నిర్వహించే స్థల ఏర్పాట్లను శుక్రవారం ఆమె స్థానిక కాంగ్రెస్ మండల నాయకులతో కలసి పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ ధర్నా కార్యక్రమానికి కోదాడ నియోజకవర్గ వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైతులు భారీ సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కొలిశెట్టి బుచ్చిపాపయ్య, బచ్చు అశోక్, దేవినేని రవి, కాసర్ల శ్రీనివాస్ ఎలియాస్ బోస్, వేనేపల్లి వీరబాబు, బత్తిని లక్ష్మీనారాయణ, గంగుల హరిబాబు, శివ పాల్గొన్నారు.

గణనాథుల నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేశాం

కోదాడ : వినాయకుల నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు చేశామని మున్సిపల్ చైర్ పర్సన్ వనపర్తి శిరీష కోరారు. శుక్రవారం కోదాడ పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో జరిగిన శాంతి కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గతంలో బాలాజీనగర్ వద్ద ఉన్న సాగర్ కాలువలో విగ్రహాల నిమజ్జన కార్యక్రమం నిర్వహించేవారని, ప్రస్తుతం సాగర్ నీరు రానందున విగ్రహాలను అనంతగిరి రోడ్డులోని కోదాడ పెద్దచెరువు వద్ద నిమజ్జనం చేయడానికి అన్ని రకాల ఏర్పాట్లు చేశామని, భక్తులు విగ్రహాలను అక్కడికే తీసుకురావాలని ఆమె కోరారు. కార్యక్రమంలో వనపర్తి లక్ష్మీనారాయణ, రంగాచార్యులు, పి.సత్యబాబు, నూనె సులోచన, సైదేశ్వరరావు, బొలిశెట్టి కృష్ణయ్య, వంగవేటి శ్రీనివాసరావు, రమేష్, రామారావు, ధనమూర్తి, శ్రీనివాసరావు, సత్యనారాయణ, ముత్యాలు పాల్గొన్నారు.

పేదలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని వినతి


ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

హుజూర్‌నగర్ : సంక్షేమ పథకాలను బీఆర్ఎస్ కార్యకర్తలకు వర్తింపజేసే విధానాన్ని మార్చుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పల్లె వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలను వర్తింప చేయాలని కోరుతూ సీపీఎం హుజూర్‌నగర్ పట్టణ, మండల కమిటీల ఆధ్వర్యంలో ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్డీఓ జగదీశ్వర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల అమలులో రాజకీయ జోక్యం తగదన్నారు. దళిత బంధు, బీసీ బంధు, మైనార్టీ బంధు, గృహలక్ష్మి, డబల్ బెడ్ రూం ఇళ్ల పథకాలను బీఆర్ఎస్ కార్యకర్తలకే ఇవ్వడం సరైన పద్ధతి కాదని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.హుస్సేన్, దుగ్గి బ్రహ్మం, శీలం శ్రీను, యోనా, వీరమల్లు, సోమయ్య, వీరయ్య, సైదా, సాంబయ్య, నాగేశ్వరరావు, శ్రీను, సైదయ్య, వెంకటేశ్వర్లు, కోటయ్య, ఖాసీ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల గడువు పెంపు

గరిడేపల్లి : తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో పదవ తరగతి, ఓపెన్ ఇంటర్ అడ్మిషన్ల గడువును 30వ తేదీ వరకు పెంచినట్లు ఓపెన్ స్కూల్ గరిడేపల్లి కోఆర్డినేటర్ ఛత్రునాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాల కోసం సెల్ నంబర్ 6304949238ను సంప్రదించాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

మునగాల : తెలంగాణ విద్యాశాఖ సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని శుక్రవారం పలువురు కాంట్రాక్టు ఉద్యోగులు మునగాల రైతు వేదిక కార్యాలయంలో ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాంపంగు వెంకటేశ్వర్లు, కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం నాయకులు బి.రాంబాబు నాయక్, శ్రీను,సునీత, జ్యోతి, భూలక్ష్మి, విజయలక్ష్మి, రాజేంద్రప్రసాద్, విజయనిర్మల పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి

చిలుకూరు : నేరేడుచర్లలో వచ్చే నెల 3వ తేదీన నిర్వహించబోయే ఏఐవైఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు కోరారు. శుక్రవారం చిలుకూరు సీపీఐ భవన్‌లో జిల్లా మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చేపూరి కొండలు, నాయకులు సాహెబ్‌అలీ, చిలువేరు ఆంజనేయులు, అనంతుల రాము, ముస్కు శ్రీనివాస్‌రెడ్డి, శ్యామ్‌సుందర్, నరేష్, రాజేష్, అంజిబాబు, రఫీ, రామారావు పాల్గొన్నారు.

న్యాయవాది మృతికి సంతాపం

హుజూర్‌నగర్ : కోదాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వక్కవంతుల విజయకుమార్ శుక్రవారం అకాల మరణం చెందారు. ఆయన మృతి పట్ల హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు తీవ్ర సంతాపం వ్యక్తం చేసి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సంతాప సూచకంగా తమ విధులను బహిష్కరించారు. హుజూర్‌నగర్, కోదాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి


సరిత దంపతులను సన్మానిస్తున్న కోదాడ గ్రంథాలయ చైర్మన్ రహీం

కోదాడ : పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న వారు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవా లని కోదాడ గ్రంథాలయ చైర్మన్ రహీం కోరారు. కోదాడ గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమై ఇరిగేషన్ శాఖలో ఉద్యోగం సాధించిన రామినేని సరితను శుక్రవారం గ్రంథాలయంలో ఆయన ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తిరుమలగిరి రాధాకృష్ణ, గోపాల్, వెంకట్, సతీష్, శివాజీ, రమేష్, త్రివేణి, వెంకటేశ్వర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.


టీపీటీఎఫ్ సభ్యత్వాలు నమోదు

నడిగూడెం : మండల కేంద్రంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్.భిక్షం, సంఘం రాష్ట్ర కౌన్సిలర్ రాపర్తి రామనర్సయ్య, జిల్లా కార్యదర్శి .మౌలానా, రామినేని సతీష్, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీలవి బూటకపు వాగ్దానాలు

హుజూర్‌నగర్: కొన్ని రాజకీయ పార్టీలు బూటకపు వాగ్దానాలతో మాల, మాదిగలను మోసం చేస్తున్నారని పీవీరావు మాల మహానాడు జాతీయ ఉపాధ్యక్షుడు పోతుల జ్ఞానయ్య అన్నారు. శుక్రవారం ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ హుజూర్‌నగర్‌లోని గోవిందపురం అంబేద్కర్ కళావేదికలో పట్టణ మాల మహానాడు అధ్యక్షుడు దగ్గుపాటి బాబురావు అధ్యక్షతన మాలల ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి, పీవీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొట్టిముక్కల రాములు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు పి.వెంకటేశ్వర్లు, జె.ప్రసాద్, డి.పున్నయ్య, పి.నరసింహారావు, పి.రాజు, బి.రాజు, బి.భాస్కర్ పాల్గొన్నారు.

సెల్ఫీ విత్ గణేశ్


మట్టి గణపతి విగ్రహానికి పూజలు చేస్తున్న కోదాడ పీఏసీఎస్ డైరెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

నెలాఖరుకు ఎడమ కాలువకు నీరు

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి


హుజూర్‌నగర్ : గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

నేరేడుచర్ల : సాగర్ ఎడమ కాలువకు నెలాఖరుకు నీటిని విడుదల చేయనున్నట్లు ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి తెలిపారు. శుక్రవారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సాగర్ ఎడమ కాలువ ఆయకట్టులో సాగు చేసిన పొలాలకు ఒక తడి నిమిత్తం నీటిని విడుదల చేసేందుకు సీఎం కేసీఆర్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. నీటి విడుదల విషయంపై కొంతమంది అనవసరమైన ఆరోపణలు చేయడం సరైంది కాదన్నారు.

పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరికలు

హుజూర్‌నగర్ : తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్నారని ఎమ్మెల్యే సైదిరెడ్డి అన్నారు. శుక్రవారం చింతలపాలెం మాజీ ఎంపీటీసీ ఎ.శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో ఆటో యూనియన్ నాయకులు బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సైదిరెడ్డి, అమీర్ తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు పంపిణీ.

గరిడేపల్లి మండలం కుతుబ్‌షాపురంనకు చెందిన కారంగుల శ్రీను ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించగా పార్టీ బీమా రూ.2 లక్షల ఇన్సూరెన్స్ చెక్కును ఆయన భార్య నాగమ్మకి ఎమ్మెల్యే సైదిరెడ్డి అందించారు.

మెరుగైన వైద్యసేవలు అందించడమే లక్ష్యం

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్


నడిగూడెం : రోగులకు మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

నడిగూడెం : పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భవ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, కోదాడ నియోజకవర్గంలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కోదాడ ప్రభుత్వ ఆసుపత్రిలో 100 పడకలకు విస్తరించామన్నారు. అనంతరం పలువురు రోగులకు ఉచిత వైద్య పరీక్షలు చేసి, మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ యాతాకుల జ్యోతి, డీసీహెచ్ఎస్ వెంకటేశ్వర్లు, ప్రోగ్రాం అధికారి డాక్టర్.కళ్యాణ్‌చక్రవర్తి, సూపరింటెండెంట్ డాక్టర్.విద్యాసాగర్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌తోనే పాఠశాలలు బలోపేతం

చిలుకూరు : బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అయ్యాయని కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం చిలుకూరు ఎంఈఓ కార్యాలయం ఆవరణలో గల ప్రాథమిక పాఠశాలలోని భవితా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో స్లాబ్ దెబ్బతిన్నదని ఉపాధ్యాయులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే వెంటనే పీఆర్ ఏఈ లక్ష్మారెడ్డితో మాట్లాడారు. తక్షణమే మరమ్మతులు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

పేదల అభ్యున్నతే ధ్యేయంగా పాలన

మునగాల : పేదల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం కేసీఆర్ రాష్ట్రంలో పాలన కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో గల రైతు వేదికలో 50 మంది లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఆయన అందజేశారు. ఎనిమిది మంది లబ్ధిదారులకు మంజూరైన రూ.3.19 లక్షల విలువగల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.ఆంజనేయులు, ఎంపీడీఓ బి.వెంకటేశ్వర్లు, మండల ఆర్ఐ రాధారెడ్డి, ఎంపీపీ ఎలక బిందు, సర్పంచ్‌లు చింతకాయల ఉపేందర్, కొప్పుల వీరమ్మ, కొప్పు ప్రమీల, కేసగాని వెంకటేశ్వర్లు, కొండపల్లి విజయమ్మ, ఎంపీటీసీలు నూకమళ్ల ఇందిర, సొంపంగు మోహన్, సొసైటీ చైర్మన్లు సత్యనారాయణ, సీతారాములు, రామిరెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్, అజయ్‌కుమార్,ఉపేందర్‌రావు, నరసింహారావు, పాషా పాల్గొన్నారు.

తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత పిల్లలదే

- ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి

హుజూర్‌నగర్ : తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత పిల్లలదేనని ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డికి అన్నారు. పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో శుక్రవారం తల్లిదండ్రుల సంరక్షణ ట్రిబ్యునల్ సభ్యుల సమక్షంలో దొండపాడు, కీతవారిగూడెం గ్రామాలకు చెందిన తల్లిదండ్రులకు సంబంధించిన రెండు కేసులను పరిశీలించి వాటిని పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలు తల్లిదండ్రులను సరిగా చూసుకోకపోతే సీనియర్ సిటిజన్ యాక్ట్ ప్రకారం వారి సంతానంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ట్రిబ్యునల్ సభ్యులు ధర్మారి వెంకటేశ్వర్లు, డి.సత్యనారాయణ, డీటీ లావణ్య, యూడీసీ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల పరీక్ష వాయిదా

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ రెవెన్యూ డివిజన్‌లో గల మండలాల్లో రేషన్ డీలర్ల నియామకం కోసం నిర్వహించాల్సిన రాత పరీక్షను వాయిదా వేసినట్లు ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24న ఆదివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించాల్సిన ఈ పరీక్షను అత్యవసర ఎన్నికల విధులు నిర్వహించాల్సి ఉన్నందున వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. తదుపరి పరీక్ష నిర్వహించే తేదీని త్వరలో తెలియజేస్తామని పేర్కొన్నారు.

వర్షంతో నీట మునిగిన వరిపొలాలు


నడిగూడెం సమీపాన నీట మునిగిన వరి పొలం

నడిగూడెం : మండల వ్యాప్తంగా గురువారం రాత్రి భారీ వర్షం కురిసింది. దీంతో నడిగూడెం, చాకిరాల, రత్నవరం వద్ద వాగులు పొంగిపొర్లాయి. నడిగూడెం సమీపాన, చాకిరాల, రత్నవరం గ్రామాల వద్ద వరి పొలాలు నీట మునిగాయి. వర్షంతో నడిగూడెం, బృందావనపురం, వేణుగోపాలపురం, చెన్నకేశ్వాపురం, కరివిరాల, వెంకట్రాంపురం, నారాయణపురం, కాగితరామచంద్రాపురం గ్రామాల్లో సాగులో ఉన్న మెట్ట పంటలకు మేలు జరిగిందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

కాలువ కాదు.. రోడ్డే


దూదియాతండాకు వెళ్లే రహదారిలో నిలిచిన వర్షపు నీరు

చిలుకూరు : మండల కేంద్రంలో శుక్రవారం తెల్లవారుజామున కురిసిన కొద్దిపాటి వర్షానికి చిలుకూరు నుంచి దూదియాతండా రోడ్డులో నీళ్లు నిలిచి కాలువను తలపిస్తోంది. చిలుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎదుట మట్టి పోయడం, రోడ్డు ఇరు పక్కల దుకణాదారులు ఆక్రమించడంతో నీళ్లు ఎటువైపు పోకుండా రోడ్డు మధ్యలో నిలుస్తున్నాయి. దీంతో ఆ రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తక్షణమే రోడ్డులో నీళ్ల నిల్వకుండా సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో గణనాథుడికి పూజలు

కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో వినాయక చవితి వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం భక్తులు గణనాథులకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పలు గ్రామాల్లోని వినాయక మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, పలు పార్టీల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

– సాక్షి నెట్‌వర్క్


హుజూర్‌నగర్ : ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డిని సన్మానిస్తున్న గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు


కోదాడరూరల్ : వేలంలో దక్కించుకున్న లడ్డూను భక్తుడికి అందజేస్తున్న నిర్వాహకులు


కోదాడ : అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి